క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే చిరుమర్తి



మంత్రి హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : తెలంగాణ వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిశారు. ఈ సందర్భంగా ఆయన రామన్నపేట ప్రభుత్వాసుపత్రి భవనానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నార్కట్‌పల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి, పలు పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



ఎంపీ కోమటిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

నకిరేకల్ : మండలంలోని పాలెం గ్రామశివారులోని అర్ధవారిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు మెంబర్ అర్ధ సురేందర్‌రెడ్డితో పాటు పలువురు టీపీసీసీ నేత దైద రవీందర్ ఆధ్వర్యంలో గురువారం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో అర్ధ రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, బాలకృష్ణారెడ్డి, యర్కలి రాములు, సత్తిరెడ్డి, శంకర్‌రెడ్డి, కోమటిరెడ్డి జాన్‌రెడ్డి, బక్కయ్య, సామ సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సామ రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తామాసయ్య మృతికి నివాళి



తామాసయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కేతేపల్లి : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు, క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర నాయకుడు పసల శౌరయ్య తండ్రి తామాసయ్య సంతాప సభను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నేతలు పాల్గొని తామాసయ్యకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ క్రిస్టియన్ మైనారిటీ రాష్ట్ర అధ్యక్షుడు సల్మాన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లింగయ్య

కేతేపల్లి : సీఎం రిలీఫ్ ఫండ్ పథకం నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని ఇనుపాముల గ్రామానికి చెందిన జాల సునీతకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును గురువారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్ల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ స్వర్ణలతసురేశ్, మారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు

మండలంలోని మండలాపురం గ్రామంలో గల వాగుపై చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.6.03 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గురువారం తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చండూరు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యాధికారి రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యలక్ష్మి భోజనాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

- రూ.26కోట్లతో సాగుతున్న రోడ్డు వెడల్పు పనులు
- నిత్యం పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే



నకిరేకల్ పట్టణంలో సాగుతున్న డివైడర్ పనులు



మెయిన్ సెంటర్‌లో జంక్షన్ ఏర్పాటుకు దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

నకిరేకల్ : నియోజకవర్గ కేంద్రమైన నకిరేకల్‌లోని ప్రధాన రోడ్ల విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఏడాది నవంబర్ 25న రూ.26కోట్లతో పనులు ప్రారంభమైన విషయం విధితమే . ఎనిమిది నెలల నుంచి పనులు సాగుతుండగా మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఆలోపే పూర్తి చేయాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులపై తరుచూ పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశిస్తూ వారానికి రెండు సార్లు పర్యవేక్షిస్తున్నారు. పనులు రెండు నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు ఈ విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలకు కూడా కొంత మేర చెక్ పడనుంది. మున్సిపాలిటీగా ఏర్పాటైన నకిరేకల్ పట్టణంలో జనాభా 40వేల పైచిలుకు కలిగి ఉంది. చుట్టు పక్కల మండలాల ప్రజలు చదువులు, వ్యాపారాల నిమిత్తం వచ్చి ఇక్కడే స్థిరపడుతుండడంతో పట్టణ జనాభా పెరుగుతూ విస్తరిస్తోంది.

కొనసాగుతున్న డివైడర్ పనులు..

ఇప్పటికే గతంలో ఉన్న డివైడర్ మధ్యలో నుంచి 50 ఫీట్ల మేర విస్తరించారు. 50ఫీట్లకు ముందుకు ఉన్న దుకాణాలు, నిఖాలతాలను తొలగించారు. పట్టణంలోని మెయిన్‌రోడ్డు పద్మనగర్ జంక్షన్ నుంచి ఇనుపాముల జంక్షన్ వరకు రెండు వైపులు డ్రెయినేజీ పనులు ఇప్పటికే 80శాతం పూర్తి చేశారు. గత పక్షం రోజుల నుంచి రోడ్డు మధ్యలో డివైడర్ పనులు సాగుతున్నాయి. డివైడర్ పనులు పూర్తి అయితే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు.

ట్రాఫిక్ సమస్యలకు చెక్..

ప్రధాన రోడ్డు విస్తరణతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడనుంది. వ్యాపార, విద్యా పరంగా ముఖ్యకూడలి అయిన నకిరేకల్ పట్టణానికి శాలిగౌరారం, కట్టంగూర్, కేతేపల్లి, తిప్పర్తి మండలాల ప్రజలతో పాటు మోత్కూరు మండలం నుంచి కూడా ప్రజలు వ్యాపారాల నిమిత్తం ఇక్కడికి అధిక సంఖ్యలో వస్తుంటారు. దీంతో పట్టణం నిత్యం రద్దీగా కనిపిస్తుంది. పట్టణంలో ఇరుకు రోడ్లు ఉండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్య తీరనుంది.

రోడ్డు విస్తరణతో దశ మారనుంది



మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు రప్పించాను. కేవలం రహదారుల అభివృద్ధికి రూ.100కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయించాను. రహదారుల అభివృద్ధిలో భాగంగానే మున్సిపాలిటీలో రూ.26కోట్లు నిధులు మంజూరు చేయించాను. ఈ పనులు మరో రెండు మాసాల్లో పూర్తయితే నకిరేకల్ దశ మారుతుంది. అదేవిధంగా మెయిన్ సెంటర్‌లో జంక్షన్ ఏర్పాటు చేస్తున్నాం.

– చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్యే

లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలి



మంత్రి తలసానికి చిత్రపటం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్ : సూర్యాపేట జిల్లాలోని దురాజ్‌పల్లి లింగమంతుల(పెద్దగట్టు) జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని కోరుతూ శ్రీ లింగమంతుల అధ్యయన పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు వల్లాల అచ్చయ్య పరందాం యాదవ్ నేతృత్వంలో యాదవ సంఘం నాయకులు గురువారం హైదరాబాద్‌లో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా అచ్చయ్య మంత్రి తలసానిపై రాసిన నవరత్న పద్యమాల సన్మాన పత్రం, జల్లెల వెంకటేశ్వర్లు గీసిన ముఖ చిత్రపటాన్ని మంత్రికి అందించి సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ షిప్ అండ్ గోట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొబ్బలి గోపాలకృష్ణయాదవ్, విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి ఆల్లి వేణుయాదవ్, గుండెబోయిన అయోధ్యయాదవ్, వల్లాల వంశీకృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం



యజ్ఞశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, తదితరులు

నల్లగొండ : ఆర్య సమాజం ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్యసమాజంలో శ్రావణమాస చతుర్వేద పారాయణ మహాక్రతువు సందర్భంగా ధ్వజారోహణ, నూతన యజ్ఞశాల, చతుర్వేద పారాయణ కార్యక్రమాన్ని ఆయన మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్య సమాజంలో నిత్యం యజ్ఞం, యోగా, కూచిపూడి నత్యాలు, కరాటే శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్య సమాజ్ అధ్యక్షుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ బోయినపల్లి కృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంచనపల్లి రవీంద్రరావు, కంది సూర్యనారాయణ, గోపాల్‌రెడ్డి, శంకర్, నరసింహచారి, శంకరయ్య, సాయిబాబా పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ : రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని తిరగండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు 24గంటల ఉచిత విద్యుత్‌ను అందించి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో తిరగండ్లపల్లి, యరగండ్లపల్లి, తమ్మడపల్లి, అజ్జిలాపురం గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య తీరనుందని తెలిపారు. అనంతరం పలు గ్రామాల్లోని 13మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, నల్ల యాదయ్య, విద్యుత్ ఏఈ రాజేష్, సర్పంచ్ ఐతపాక జంగయ్య, ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణ, మునగాల వెంకటేశ్వర్‌రావు, బాలం నర్సింహ, పందుల యాదయ్య, రామిడి వెంకటరమణరెడ్డి, లాలునాయక్, చెరుకు శ్రీరాములు, దాసరి గోపాల్, మాదగోని శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా ముత్యాలమ్మ బోనాల వేడుకలు



రామగిరి(నల్లగొండ) : ముత్యాలమ్మ ఆలయానికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



నకిరేకల్ : వల్లాభాపురంలో..



కేతేపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

నకిరేకల్ : మండలంలోని వల్లభాపురం, తాటికల్ గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. వల్లభాపురంలో జెడ్పీటీసీ మాధ ధనలక్ష్మి బోనం ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు.

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని జంగారెడ్డిగూడెంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు ముత్యాలమ్మ దేవతకు బోనాలు, నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు దాసరి జానయ్య, గ్రామస్తులు లింగంపల్లి రమేష్, రవీందర్, శ్రీకాంత్, కిరణ్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల, రామచంద్రాపురం, కురుమర్తి, పరడ, బొల్లేపల్లి, మల్లారం, బిల్లంకానిగూడెం, శ్రీకృష్ణనగర్ గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన పట్టు వస్త్రాలను సమర్పించి పూజలు చేశారు. మహిళలు బోనాలతో ఆలయాల చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

కేతేపల్లి : మండల కేంద్రంతో పాటు మండలంలోని కొర్లపహాడ్, చీకటిగూడెం, గుడివాడ తదితర గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ (బోనాలు) పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ముత్యాలమ్మ, మారెమ్మ ఆలయాలకు వెళ్లి నైవేద్యాన్ని, పట్టువస్త్రాలను అమ్మవార్లకు సమర్పించారు. వేడుకల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు జటంగి ముత్తమ్మ, కోట వెంకటేశ్వరావు, కట్ట శ్రవణ్, ఎడ్ల పార్వతమ్మ, నాయకులు పాల్గొన్నారు.

శాలిగౌరారం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముత్యాలమ్మ, మహంకాళమ్మ దేవతా బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆయా దేవాలయాల వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వనిపాకలలో పెద్దమ్మతల్లి బోనాలు

చిట్యాల : మండలంలోని వనిపాకల గ్రామంలో గురువారం యాదవులు పెద్దమ్మతల్లి బోనాల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఆలయానికి వెళ్లి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికకు సర్వే



కనగల్ : ఎం గౌరారంలో ఇంటింటి సర్వే చేస్తున్న ఆర్ఐ యాదగిరి తదితరులు

కనగల్ : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు అధికారులు గురువారం మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్ఐ మర్రి యాదగిరి మాట్లాడుతూ.. మండలంలో 2వేలకు పైగా లబ్ధిదారులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు ఆయా గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి అర్హుల జాబితాను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తామన్నారు. సర్వేలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారుల విచారణ

చండూరు(గట్టుప్పల్) : గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు రెవెన్యూ అధికారులు గురువారం విచారణ చేపట్టారు. గట్టుప్పల్ మండలంలో 860 దరఖాస్తులు రాగా ఆయా గ్రామాల్లో విచారణ బృందాలు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తూ ఎంపిక చేస్తున్నారు.

దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

మునుగోడు : గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరి ఇంటికి వెళ్లి దరఖాస్తుదారుడి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్.నరేష్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుల తనిఖీ బృందానికి నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న 26గ్రామాల నుంచి 2070 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని పరిశీలించేందుకు ఏడు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్.భాస్కర్‌గౌడ్, వివిధ శాఖల మండల అధికారులు తదితరులు ఉన్నారు.

చీకటిమామిడిలో డీఎల్‌పీఓ విచారణ



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ

మునుగోడు : మండలంలోని చీకటిమామిడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నల్లగొండ డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. ఆ గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించడం లేదని ఉప సర్పంచ్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గురువారం డీఎల్‌పీఓ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులతో పాటు పంచాయతీ కార్యదర్శిని విచారించారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ సుమలత, పంచాయతీ కార్యదర్శులు మురళికృష్ణ, లింగస్వామి, సర్పంచ్ తాటికొండ సైదులు, ఉప్ప సర్పంచ్ ఏరుకొండ శ్రీను తదితరులు ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉపాధి కల్పన అధికారి

నల్లగొండ : యువత విద్యతోపాటు సాంకేతిక అంశాల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ సూచించారు. గురువారం నల్లగొండలోని రెవెన్యూ భవన్‌లో రాష్ట్ర ఉపాధి శిక్షణ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంకల్ప పథకం శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏపీపీసీ సీనియర్ కన్సల్టెంట్ నసీర్‌సిద్ధికి, కో ఆర్డినేటర్ శివరాజు, రిసోర్స్ పర్సన్లు కోటేష్, జేఎస్ఎస్ డైరెక్టర్ ఖాజా మసీయోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ నుంచి నల్లగొండ మీదుగా గుంటూరు వరకు డబ్లింగ్ లైన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బీజేపీ నాయకులు గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. డబ్లింగ్ లైన్ ఏర్పాటుతో వ్యాపార రంగం అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశ వ్యాప్తంగా వందే భారత్ రైళ్లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, దాసోజు యాదగిరాచారి, దాయం భూపాల్‌రెడ్డి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, నేవర్సు నీరజ, ఏరుకొండ హరి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణమాస పూజలు

చిట్యాల : పట్టణంలోని శ్రీ కనకదుర్గా ఆలయంలో శ్రావణమాస పూజలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించనున్నారు. ఈనెల 25న వరలక్ష్మీ వ్రతం, కుంకుమార్చన పూజలు, సెప్టెంబర్ 1న పుష్పాభిషేకం, 8న క్షీరాభిషేకం కార్యక్రమాలను చేయనున్నట్లు ఆలయ చైర్మన్ సత్యనారాయణ గురువారం తెలిపారు.

రోడ్డు పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కమిషనర్ కేవీ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్దబండలో చేపడుతున్న రోడ్డు పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం 20వ వార్డు పెద్దబండలో చేస్తున్న రోడ్డు విస్తరణ, శానిటేషన్ పనులు ఆయన పరిశీలించి మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. కాలనీల ప్రజలు చెత్తను రోడ్ల వెంట, ఖాళీ స్థలాల్లో వేయకుండా మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, కౌన్సిలర్ గోగుల శ్రీనివాస్‌యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకానికి అర్హులను గుర్తించాలి

మున్సిపాలిటీలో గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వార్డుల్లో తిరిగి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, మెప్మా ఆర్పీలు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 20లోగా అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు మొక్కల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. చెత్త రోడ్ల వెంట వేయకుండా మున్సిపల్ వాహనాల సిబ్బందికి అందించేలా ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

డీఈఓ, ఎంఈఓను సస్పెండ్ చేయాలి

చండూరు : ప్రభుత్వ ఉపాధ్యాయులను అక్రమ డిప్యుటేషన్‌లు చేసిన డీఈఓ, చండూరు ఎంఈఓను సస్పెండ్ చేయాలి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. గురువారంమండల కేంద్రంలోని నిర్వహించిన సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవసరం ఉన్నా వ్యక్తిగత ప్రయోజనాల కోసం బదిలీపై పంపడం ఎంటని ప్రశ్నించారు. అక్రమ డిప్యుటేషన్‌ల కోసం డబ్బులు తీసుకుని విద్యార్థుల చదువులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో తరుణ్, రవి, కృష్ణ, రమేష్, రవీందర్, జగదీశ్ పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్య అరెస్ట్‌పై నిరసన

నల్లగొండ టూటౌన్ : సీఆర్పీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పాఠశాల కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ బీసీ సంఘం నాయకులు గురువారం పట్టణంలోని పూలే విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆర్.కృష్ణయ్యను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో గుండు వెంకటేశ్వర్లు, కల్లూరి సత్యనారాయణ, వెంకన్న, దుర్గ, కృష్ణ, సతీష్‌యాదవ్, శ్రీనివాస్, రవీంద్రచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

శాలిగౌరారం : ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం సభ్యత్వ నమోదు, సంఘం రాష్ట్ర మహాసభ నిర్వాహణకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో పాఠశాలలలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు వినియోగానికి వీలులేకుండా మారాయన్నారు. వెంటనే స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల ప్రతినిధులు సైదులు, యాదగిరి, యాకూబ్‌అలీ, నర్సింహాచారి, వెంకటేశ్వర్లు, నగేశ్, వెంకటాచారి, వెంకటయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలో చేపడుతున్న రోడ్ల అభివృద్ధి పనుల్లో భాగంగా శుక్రవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు కోర్టు, కలెక్టర్‌బంగ్లా, స్కాట్‌హాల్, ప్రకాశం బజార్, జెడ్పీ ఆఫీస్, రిజిస్ట్రేషన్ ఆఫీస్, మున్సిపాలిటీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్ట్ కృష్ణారావు మృతికి గుత్తా సంతాపం

నల్లగొండ టూటౌన్ : సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ సీహెచ్.ఎం.వీ కృష్ణారావు మృతి పట్ల శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో వైద్యశిబిరం

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రంలో నర్రా రాఘవరెడ్డి ప్రజా వైద్యశాల, ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంవీఎన్ ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు ప్రతి రోజు ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94900 98311లో సంప్రదించాలన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

చండూరు : పేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బురకల దశరథగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలను సందర్శించిన మాట్లాడారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కట్టంగూర్ : అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గురువారం సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకున్నారు. సివిల్ సప్లయ్ డీటీ జ్యోతి తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో భూపతి శంకర్ ఇంట్లో అశోక్ లీల్యాండ్ మినీ వాహనంలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిలువ ఉన్నాయని సమాచారం అందింది. ఆ మేరకు తనిఖీ చేయగా వాహనం పట్టుబడినట్లు తెలిపారు. 100 క్వింటాళ్ల బియ్యం ఉన్న వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. భూపతి శంకర్‌కు సహకరించిన గుండగోని చంద్రశేఖర్, భీమనబోయిన లింగరాజు, సతీష్, కందగట్ల శివల పై 6ఏ క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యవసాయ బోర్ల వైర్లు చోరీ

చిట్యాల: మండలంలోని గుండ్రాంపల్లి గ్రామశివారులోని పలువురి వ్యవసాయ మోటార్ల స్టార్టర్లను ధ్వంసం చేసి వైర్లను మంగళవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన బీమిడి చినవెంకట్‌రెడ్డి, బీమిడి సత్యం రెడ్డి, నక్కెర్తి శ్రీనివాస్, కామాటి లింగయ్య, ఆనంతయ్యకు చెందిన వ్యవసాయ బావుల వద్ద మోటర్లు స్టార్టర్లను ధ్వంసం చేసిన దొంగలు వైర్లను కట్ చేసి అపహరించారు.

కేసు నమోదు

రామగిరి(నల్లగొండ) : కారు ఓ బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో గురువారం తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కందుల మణికంఠ(16) ఆగస్టు 14న నకిరేకల్ వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ కుడి కాలు విరిగింది. గురువారం మణికంఠ తండ్రి జానయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.ధర్మ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

నార్కట్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి నేటికి కనీసం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని బీజేపీ మండల అధ్యక్షుడు కోరివి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు గురువారం ఇళ్ల మంజూరు చేయాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వీరయ్య, రమేష్, శ్రవణ్, నరసింహ, నాగరాజు ఉన్నారు.